సాక్షి కామారెడ్డి
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



బ్రిడ్జి సైడ్ వాల్‌ను ఢీకొని..

స్టీరింగ్ ఫెయిల్యూర్ కారణంగా 161 హైవే బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఇటుక లారీ ఢీకొట్టింది. ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు.

- 8లో ▸



వనమహోత్సవం..

వన క్షేమమే.. మనందరి క్షేమమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /22.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

లంచం అడిగితే 1064కు కాల్ చేయండి



కామారెడ్డి క్రైం: పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు అధికారులు లేదా ఇతర సిబ్బంది లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో గురువారం ఏసీబీ అధికారులు పర్యటించి టోల్‌ఫ్రీ నంబర్ 1064 స్టిక్కర్లను అతికించారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా నిజామాబాద్ రేంజ్ అవినీతి నిరోధకశాఖ అధికారికి నేరుగా ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు సూచించారు. అవినీతి నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీకి అవకాశం

కామారెడ్డి అర్బన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగిలిపోయిన 10శాతం అదనపు ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీకి అవకాశం ఉన్నట్లు నిజామాబాద్ డైట్ ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఆగస్టు 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోని అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీ వరకు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఇప్పటి వరకు ప్రవేశాలు పొందని ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ఆగస్టు 6, 7 తేదీల్లో వెబ్ ఆప్షన్ నమోదు చేసుకుంటే ఆగస్టు 11న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

బియ్యం మింగిన మిల్లర్లు!

- రికవరీ చేయడంలో అధికారుల మీనమేషాలు
- మూడు సీజన్లలో కలిపి 34 వేల మెట్రిక్ టన్నులు..
- రికవరీ చేసింది 13,365 ఎంటీలు మాత్రమే..
- ఇంకా 20 వేల మెట్రిక్ టన్నుల బకాయి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సీఎంఆర్‌కు సంబంధించి బియ్యాన్ని మింగిన మిల్లర్ల నుంచి రికవరీ చేయడంలో సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పెండింగ్ బకాయిల రికవరీ కోసం కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులతో రివ్యూ చేస్తూ రికవరీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నారు. అయినప్పటికీ అధికారులు కొంత నిర్లక్ష్యం చేస్తున్నట్టే కనిపిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా నోటీసులు, ఆదేశాలంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. అధికారుల అలసత్వాన్ని ఆసరా చేసుకుని బియ్యం మింగిన మిల్లర్లు నోటీసులను పెద్దగా లెక్కచేయడం లేదు. పైగా ఆ ఏమవుతుందిలే.. కేసులు పెడితే చూద్దామనే ధోరణితో కనిపిస్తున్నారు. కాగా చిన్న చిన్న కారణాలతో రేషన్ డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసే అధికారులు రూ.కోట్ల విలువైన బియ్యాన్ని మింగేసిన మిల్లర్లను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బియ్యం విలువ రూ.104 కోట్లు

సీఎంఆర్‌కు సంబంధించి బకాయిపడిన బియ్యం విలువ రూ.104 కోట్ల మేర ఉంటుందని అధికారులు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడిగా ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా సొంతానికి వాడుకోవడం అంటే దుర్వినియోగం చేసినట్టే. మిల్లర్లకు రాజకీయ అండదండలు కూడా ఉండడంతో అధికారులు ధైర్యం చేయడం లేదని తెలుస్తోంది. ఏళ్లు గడుస్తున్నా రికవరీ చేయకపోవడం అంటే ప్రభుత్వానికి నష్టం చేసినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్ బకాయల రికవరీ పై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆ మూడు సీజన్‌లలో..

జిల్లాలో 2021–22 ఖరీఫ్ సీజన్‌లో 39 మిల్లులు 10,406 మెట్రిక్ టన్నులు, 2021–22 యాసంగిలో రెండు మిల్లులు 562 మెట్రిక్ టన్నులు, 2022–23 ఖరీఫ్ సీజన్‌లో 37 మిల్లులు 23,014 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయపడ్డారు. మొత్తంగా 78 మిల్లుల నుంచి 34 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రికవరీ చేయాల్సి ఉండగా, కేవలం 19 మిల్లుల నుంచి 13 వేల మెట్రిక్ టన్నులు రికవరీ చేశారు. ఇంకా 59 మిల్లుల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రికవరీ చేయాల్సి ఉంది. బకాయిపడిన మిల్లర్లకు ఫైన్ కింద 25 శాతం అదనంగా అంటే 125 శాతం ఇవ్వాలని నిబంధనల ప్రకారం అంటే 28 వేల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా బియ్యం విలువ రూ.74.97 కోట్లు ఉందని, 25 శాతం అదనంగా అంటే రూ.104.27 కోట్లు బకాయ పడినట్టు స్పష్టమవుతోంది.

నోటీసులతో కాలయాపన..

బకాయిపడిన బియ్యానికి సంబంధించి డబ్బులు చెల్లించాలని బియ్యం బొక్కేసిన మిల్లర్లకు నోటీసులు ఇవ్వడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ చేయాలని ఆయా తహసీల్దార్లకు ఆదేశాలిచ్చారు. అలాగే ఆయా మిల్లుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయాలని, ఆస్తుల మార్పిడి జరగకుండా చూడాలని సబ్ రిజిస్ట్రార్‌లకు ఆదేశాలిచ్చి చేతులుదులుపుకున్నారు. సీఎంఆర్‌కు సంబంధించిన బియ్యం ఇవ్వకుండా వాడేసుకున్న మిల్లర్ల నుంచి రికవరీ చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అధికారులకే తెలియాలి.

ఏళ్లు గడుస్తున్నా బియ్యాన్ని గానీ, బియ్యానికి సరిపడా డబ్బులు కానీ రికవరీ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. పెండింగ్ బకాయిలను రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు.

గ్రామాల్లో పండగ వాతావరణం



లబ్ధిదారుకు రేషన్‌కార్డు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, పౌరసరఫరాలశాఖ అధికారి మల్లికార్జున్

- రేషన్‌కార్డుల మంజూరుతో నిరీక్షణకు తెర
- ప్రజాసంక్షేమమే మొదటి ప్రాధాన్యత
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నూతన రేషన్‌కార్డుల పంపిణీతో గ్రామాల్లో నూతన పండగ వాతవరణం నెలకొందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని గోపాల్‌పేట రైతువేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌తో కలిసి ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల మంజూరుతో పేదల నిరీక్షణకు తెరపడిందన్నారు. నూతన కార్డుల మంజూరు, పాత కార్డుల్లో పేర్ల నమోదుతో పేదలు ఆనందంగా ఉన్నారన్నారు. ఎల్లారెడ్డి డివిజన్‌లో 6,934 మందికి నూ తన రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, మొద టి విడతలో 2,616 కార్డులను లబ్ధిదారులకు అందజేశామని వివరించారు. ప్రజాసంక్షేమమే మొదటిప్రాధాన్యతగా రేషన్‌కార్డులను పంపిణీ చేశామని అన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందజేస్తామని, కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. అనంతరం తెలంగాణ వేర్ హౌసింగ్ గోదాము నిర్మాణం కోసం మాల్తుమ్మెద శివారులోని సర్వే నంబర్ 834లో తొమ్మిది ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి మల్లికార్జున్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెయూకు ఇంజినీరింగ్ కళాశాల

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం జీవో నెంబరు 32 జారీ చేసింది. ప్రజలు, విద్యార్థులు, విద్యావంతుల నిరంతర పోరాటాలు ఎట్టకేలకు ఫలించాయి.

జీవో జారీ చేసిన ప్రభుత్వం

- నాలుగు కోర్సులకు అనుమతి
- మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ
- సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు
- వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

పదేళ్ల కల సాకారం



తెయూ(డిచ్‌పల్లి): పదేళ్ల ఎదురు చూపులకు తెర దించుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడం ఆనందంగా ఉందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం తెయూ పరిపాలనా భవనంలో మీడియాతో వారు మాట్లాడారు. గతంలో తాను వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు తెలంగాణ వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల ఇస్తానని స్వయంగా చెప్పారని, ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా జీవో నెంబర్ 32ను గురువారం జారీ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కళాశాల మంజూరు చేసిన సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వీసీ పేర్కొన్నారు.

మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

ప్రస్తుతం ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ రెండో విడత కౌన్సెలింగ్ కొనసాగుతున్నందున మూడో విడత కౌన్సెలింగ్‌లో తెయూ ఇంజినీరింగ్ కళాశాల పేరు చేర్చి సీట్ల భర్తీ చేపడతారని వీసీ యాదగిరి రావు పేర్కొన్నారు.

సౌత్ క్యాంపస్‌లో సంబురాలు

భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు కావడాన్ని హర్షిస్తూ డాక్టరేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు గురువారం సౌత్ క్యాంపస్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ల కల నేరవేరిందని అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బాణాసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకు న్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అసోసియేషన్ ప్రతినిధులు రాహుల్ నేత, సరిత, సత్యం, రమేశ్, అధ్యాపకులు అంజయ్య, మోహన్‌బాబు, యాలాద్రి పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు స్వీట్లు తినిపిస్తున్న విద్యార్థులు

చర్చాగోష్ఠి.. ప్రత్యేక కథనాలు

- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన విద్యావేత్తలు, విద్యార్థి నాయకులు



తెయూ(డిచ్‌పల్లి) : తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు 'సాక్షి' తనవంతు కృషి చేసింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాను సందర్శించిన సమయంలో తెయూకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ ప్రత్యేక కథనాలను ప్రచురించింది. 12 ఏప్రిల్ 2025న 'సాక్షి' టౌన్ ఆఫీస్‌లో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించింది. జూలై 8న 'మంజూరు చేస్తే చాలు' అనే కథనాన్ని 'సాక్షి' ప్రచురించింది. 577 విశాలమైన క్యాంపస్‌తోపాటు సైన్స్ కాలేజ్ భవనం, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ అందుబాటులో ఉన్నాయంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఆగస్టు 15లోపు జిల్లా పర్యటనకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభింపజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వీసీ యాదగిరిరావు తెలిపారు. అలాగే వర్సిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు.

మంజూరైన కోర్సులు..

ప్రస్తుత విద్యా సంవత్సరం (2025–26)లో బీటెక్ కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, డాటా సైన్స్ కోర్సులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6 సీట్లు మొత్తం 264 సీట్లు భర్తీ చేస్తారని వీసీ చెప్పారు.

టీచర్ల పదోన్నతులకు కసరత్తు!

- జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు 29
- స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 158
- సీనియారిటీ లెక్కలు తీస్తున్న విద్యాశాఖ
- ఉత్తర్వులు వెలువడగానే కార్యాచరణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి కసరత్తు నడుస్తోంది. జిల్లాలో 29 గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టులు, 240 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే గెజిటెడ్ హెడ్మాస్టర్ పోస్టులన్నీ ప్రమోషన్ల ద్వారానే భర్తీ అవుతాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు. మిగతా పోస్టులు 158 ప్రమోషన్ల ద్వారా భర్తీ చేస్తారు. ఇందులో 52 బ్యాక్‌లాగ్ పోస్టులను సంబంధిత వర్గాలకు చెందిన అర్హుల్లో సీనియారిటీ ద్వారా తొలుత భర్తీ చేస్తారు. తరువాత మిగతా 106 పోస్టులను సీనియారిటీ ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఇందులో నుంచి ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్లుగా దాదాపు 41 మందికి అవకాశం దక్కనుంది.

గతేడాది ప్రభుత్వం ప్రమోషన్లు, నియామకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా ఉపాధ్యాయుల ప్రమోషన్లు చేపట్టి, మిగతా ఖాళీల భర్తీకి డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఆయా పోస్టుల్లో అర్హులైన ఉపాధ్యాయుల్లో సీనియారిటీ జాబితాను రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే కార్యాచరణ మొదలవుతుందని డీఈవో రాజు 'సాక్షి'తో తెలిపారు. ప్రమోషన్లతో మరికొందరు ఉపాధ్యాయులకు అవకాశం దక్కుతుంది. ఇదే సమయంలో ఖాళీ అయ్యే ఎస్జీటీ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే నిరుద్యోగులకు అవకాశం దక్కనుంది.

క్లుప్తంగా

మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



బాన్సువాడ రూరల్: బీర్కూర్ గ్రామానికి చెందిన నర్రసాయిలు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన నల్లజెరు జ్యోతిని పెళ్లి చేసుకుని మోసం చేశాడని అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం మాల సంఘం ప్రతినిధులు డీఎస్పీ విఠల్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరితే జ్యోతితో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయించాడని ఆరోపించారు. తప్పుడు కేసులను కొట్టివేయడంతో పాటు జ్యోతి, ఆమె కుమారుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారు మైసయ్య, మల్లూరు సాయిలు, ప్రశాంత్, బాలసాయిలు, మన్నె సాయిలు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 1 నుంచి 30 వ తేదీ వరకు 30, 30(ఏ) పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకూడదని అన్నారు. ఏవైనా కార్యక్రమాలు చేయాలనుకుంటే సంబంధిత డివిజన్ పోలీసు అధికారులను సంప్రదించి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బాధ్యతగా విధులు నిర్వహించాలని సీఐ రవీందర్ పోలీస్ సిబ్బందికి సూచించారు.గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ రవీందర్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి క్రైం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనదారులకు, సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులు హక్కులను వినియోగించుకోవాలి



మద్నూర్(జుక్కల్): ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలని డోంగ్లీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గాలో గురువారం సివిల్‌రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని సూచించారు. ప్రతి నెలా చివరి రోజున గ్రామాలలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- వందశాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ఎల్లారెడ్డిలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వందశాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అధికారులకు సూచించారు. గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రతి జీపీ కార్యదర్శిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభమైన చోట పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రారంభం కాని చోట పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. పనులు సకాలంలో ప్రారంభించని పక్షంలో ఇందిరమ్మ ఇళ్లు రద్దవుతాయని లబ్ధిదారులకు సూచించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభంకాని వారికి వారి వారి గ్రామాలలోని డ్వాక్రా సంఘాల ద్వారా ఇంటి నిర్మాణానికి రుణాలను ఇప్పించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.అటవీభూమికి సంబంధించిన సమస్యలు ఉన్న ప్రాంతాలలో ఆర్డీవో దానికి సంబంధించిన సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.అధికారులు సైతం పనులు ప్రారంభించిన వారికి సంబంధించిన బిల్లులు చెల్లించడంలో ఎలాంటి జాప్యం చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, హౌజింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, డీపీవో మురళి, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, హౌజింగ్ ఏఈలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు,మండల కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు సాయిబాబా, శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిసిన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పంటల సాగు, ఎరువులు వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో మధ్యంతరంగా నిలిచిన వ్యవసాయశాఖ భవన నిర్మాణానికి సంబంధించిన పనులు జరిగేలా చూడాలని వారు కోరారు. ఏడీఏ సుధామాధురి, ఏవోలు అనిల్, రాజలింగం, నదిమొద్దీన్ తదితరులున్నారు.



సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

జాతీయ ఓబీసీ మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

జాతీయ ఓబీసీ మహాసభ వాల్‌పోస్టర్లను ఓబీసీ సంఘం నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు శివరాములు, నాగరాజులు తెలిపారు. జాతీయ మహాసభకు ఓబీసీ సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘం నాయకులు భూమన్న తదితరులున్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి..

- డీఎఫ్‌వో కార్యాలయానికి తరలివచ్చిన కాటేపల్లి వాసులు



డీఎఫ్‌వో కార్యాలయానికి తరలివచ్చిన కాటేపల్లితండా వాసులు

కామారెడ్డి క్రైం: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ భూములు అంటూ అధికారులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని పెద్ద కొడప్‌గల్ మండలం కాటేపల్లి తండావాసులు అన్నారు. దాదాపు 20 మంది గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయానికి తరలి వచ్చారు. డీఎఫ్‌వో నిఖిత ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం జుక్కల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్, గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇటీవల కాటేపల్లి తండా శివారులో అటవీ అధికారులు దాడులు నిర్వహించి గత 20 ఏళ్లకు పైగా తాము సాగు చేసుకుంటున్న భూముల్లో పంటలను జేసీబీలు, ట్రాక్టర్ లతో దున్నివేశారని తెలిపారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్న కాలం నుంచి ఈ ప్రాంతంలోని దాదాపు 60 ఎకరాలకు పైగా భూమిని సాగు చేసుకుంటూ 30 కి పైగా కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. అధికారులు వచ్చి అటవీ భూములంటూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికే 20 ఎకరాల్లో వేసిన పంటలను చెడగొట్టారని పేర్కొన్నారు. దీంట్లో అనేక మంది నిరుపేద రైతులు ఉన్నారని అన్నారు. వేలల్లో పెట్టుబడులు పెట్టిన పంటలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను తిరిగి ఇవ్వాలని, కోల్పోయిన పంటలకు నష్ట పరిహారం అందించాలనీ డీఎఫ్‌వోకు విన్నవించినట్లు తెలిపారు.

గుడ్ల సరఫరాకు టెండర్ల ప్రక్రియ



కామారెడ్డి క్రైం: అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, హాస్టళ్లకు 2025–26 సంవత్సరానికి గాను కోడి గుడ్లను సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియను నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా ఇదివరకు వేసిన బిడ్‌లను కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమక్షంలో తెరిచారు. ఇద్దరు బిడ్డర్లు మాత్రమే టెండర్‌ల ప్రక్రియలో పాల్గొన్నారు. సదరు బిడ్డర్ల నుంచి అందిన టెక్నికల్ బిడ్‌లను నిబంధనల ప్రకారం పరిశీలించి టెండర్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల మంజూరు హర్షణీయం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడం హర్షణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తులు, ఇన్‌చార్జి మంత్రి సీతక్క కృషి ఫలితంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేశారని, దీంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై అధికారుల అధ్యయనం



మాట్లాడుతున్న కేంద్రబృందం అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):నాగిరెడ్డిపేట మండలంలోని వాడి, అక్కంపల్లి గ్రామాల్లో కేంద్రప్రభుత్వ పథకాల అమలుతీరుపై గురువారం కేంద్రబృందం అధికారులు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కేంద్రబృందం అధికారులు ఉపాధిహామీ కూలీలతో పాటు పింఛన్‌దారులతో,మహిళాసంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్న తీరును కూలీలను అడిగి వారు తెలుసుకున్నారు.దీంతోపాటు వికలాంగ, వితంతు, వృద్ధాప్య పింఛన్ డబ్బుల చెల్లింపులపై వారు ఆరాతీశారు.మహిళాసంఘాల ఆర్థికాభివృద్ధిపై వారు వివరాలు సేకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వ పథకాలైనా ఉపాధిహామీ పథకంతోపాటు పింఛన్లు, మహిళాసంఘాల సభ్యులకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటున్నామన్నారు.ఉపాధిహామీ పథకం అమలులో ఏమైనా లోటుపాట్లు జరిగితే భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడతామని వారు చెప్పారు. కార్యక్రమంలో కేంద్రబృందం సభ్యులు సుధాకర్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, ఐకేపీ ఏపీయం జగదీశ్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో సాయిలు, పంచాయతీ కార్యదర్శులు నరేష్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్ చంద్ రచనల్లో గ్రామీణ జీవితం కనిపిస్తోంది



భిక్కనూరు/కామారెడ్డి అర్బన్ : ప్రముఖ హిందీ నవల రచయిత ప్రేమ్ చంద్ రచనల్లో గ్రామీణ జీవితం గ్రామీణ వ్యవహారాలు అనుబంధాలు ఉంటాయని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్ అన్నారు. గురువారం మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రేమ్ చంద్ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కవి ప్రేమ్‌చంద్ జయంతిని నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హిందీ విభాగ అధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ జాతీయ సాహిత్యంలో ప్రేమ్‌చంద్ గోదాన్ నవల ప్రసిద్ధి చెందిందన్నారు. విద్యార్థులకు హిందీ వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు,బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య, సమన్వయకర్తలు పి.విశ్వప్రసాద్, బాలాజీ, ఉపాధ్యాయులు తబిత, ప్రవీణ, లింగం, సత్యనారాయణ, బాల రాజయ్యలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ నిధుల మంజూరుతో పనుల ప్రారంభం



పెద్ద ఎక్లార గురుకుల పాఠశాలలో అధికారులు

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద గల సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం పలు శాఖల అధికారులు అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురుకుల పాఠశాలను సందర్శించిన సమయంలో పాఠశాలలో సమస్యలున్నాయని కలెక్టర్ దృష్టికి విద్యార్థినులు వివరించగా వెంటనే స్పందించి రూ. 2 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. పాఠశాలలో చేపట్టాల్సిన పనులు ప్రారంభించడానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశాలతో మండల తహసీల్దార్ ముజీబ్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈఈ, విద్యుత్ శాఖ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు, ఇతర శాఖల అధికారులు పనుల కోసం ప్రణాళికలు తయారు చేశారు. హాస్టల్ మెస్ వరకు విద్యుత్ స్తంబాల ఏర్పాటు, తాగునీరు కోసం బోరుబావి, హాస్టల్ భద్రత సిబ్బంది కోసం గది నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. దీంతో గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.

వనమహోత్సవం అందరి బాధ్యత



సౌత్‌క్యాంపస్‌లో మొక్కలకు నీరు పోస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- మొక్కలు నాటి సంరక్షించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

భిక్కనూరు: వన క్షేమమే.. మనందరి క్షేమమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో గురువారం వనమహోత్సవం నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు.ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని, భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. సౌత్ క్యాంపస్‌లో 30 వేల మొక్కలను నాటేందుకు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మొక్కలను స్పాన్సర్‌చేసిన అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, డాక్టర్‌ప్రతిజ్ఞలను కలెక్టర్ సత్కరించి అభినందించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సురేందర్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఆర్‌ఐ బాలయ్య, ఇంజనీరింగ్ అధికారి రాధిక,అధ్యాపకులు మోహన్,సరిత,రమాదేవి, నర్సయ్య,అంజయ్య,నాగరాజు, శ్రీకాంత్, శర్మ, దిలీప్, సంతోష్‌గౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి



సదాశివనగర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివనగర్/కామారెడ్డి అర్బన్/రాజంపేట : ఉపాధ్యాయుల విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండవ దశ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ విజయరామరాజు అన్నారు. గురువారం సదాశివనగర్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఆగస్టు 5న ఉపాధ్యాయుల ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుఎస్‌పీసీ జిల్లా ప్రతినిధి దేవుల, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిన్న రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ ప్రభాకర్, టీచర్లు ఆవిష్కరించారు.ఉపాధ్యాయులు గంగాకిషన్, బాబురావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు. రాజంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఎంఈవో పూర్ణచందర్ రావు, కాంప్లెక్స్ హెచ్ఎం డి. ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఢీకొట్టిన లారీ



బ్రిడ్జిపై సైడ్ వాల్ ను ఢీకొని ఆగిన లారీ

- ఎన్‌హెచ్ 161 పై ఘోర ప్రమాదం
- పైనుంచి సర్వీస్ రోడ్డుపై పడిన ఐదుగురు కూలీలు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ప్రమాదానికి స్టీరింగ్ వైఫల్యమే కారణం



సర్వీస్‌రోడ్డుపై పడిపోయిన కూలీలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161 పై ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్టీరింగ్ వైఫల్యం కారణంగా లారీ హైవే బ్రిడ్జిపై సైడ్‌వాల్ ను ఢీకొట్టడంతో క్యాబిన్‌లో కూర్చున్న ఐదుగురు కూలీలు పైనుంచి సర్వీస్ రోడ్డుపై పడిపోయారు. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన ముగ్గురిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం పిట్లం మండలం నుంచి ఇటుక లోడ్ చేసుకొని మద్నూర్‌కు వెళ్లిన లారీ (ఏపీ 26 ఎక్స్ 1377) తిరిగి వస్తుండగా.. పెద్దకొడప్‌గల్‌లో నేషనల్ హైవే 161 బ్రిడ్జిపై స్టీరింగ్ ఫెయిలై సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. క్యాబిన్‌లో డ్రైవర్‌తోపాటు ఐదుగురు కూలీలు కూర్చున్నారు. లారీ సైడ్‌వాల్ ను ఢీ కొట్టగానే డ్రైవర్ మినహా ఐదురు కూలీలు క్యాబిన్‌లో నుంచి కింద ఉన్న సర్వీస్‌రోడ్డుపై పడిపోయారు. పిట్లం మండలం రూం తండాకు చెందిన హలావత్ నర్సింగ్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. మహారాష్ట్రకు చెందిన గణేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. మహారాష్ట్రకు చెందిన బింబాటో, రూం తండాకు చెందిన శోభన్, హలావత్ రమేశ్‌కు గాయాలుకాగా.. చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

బడుగు, బలహీనవర్గాలకు కాంగ్రెస్ రక్షణ

- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్
- ముగిసిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా శిక్షణా శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

నిజామాబాద్ సిటీ: బడుగు, బలహీనవర్గాలు, గిరిజనులు, ఆదివాసీల హక్కుల కోసం కాంగ్రెస్ పాటుపడుతుందని, వారికి రక్షణగా పార్టీ ఉంటుందని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదల సంక్షేమం జరిగిందని, పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. జిల్లాకేంద్రంలోని హోటల్ హరితలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశావ్యాప్తంగా 25వేల మంది ఆదివాసీలు, గిరిజనులను మంచి నాయకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న కార్యకర్తలకు సర్టిఫికేట్లు అందించారు. ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, జిల్లా ఆదివాసీ గిరిజన చైర్మన్ కెతావత్ యాదగిరి, రాణాప్రతాప్ రాథోడ్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, నాయకులు రాహుల్‌బాల, చంద్రు నాయక్, కెతావత్ ప్రకాష్ నాయక్, చాంగుబాయి, సురేష్ నాయక్, సుభాష్ జాదవ్ ఉన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ



హన్మాజీపేట్‌లో రేషన్‌కార్డు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న జీపీ కార్యదర్శి రాజేశ్

బాన్సువాడ రూరల్/బీబీపేట/రామారెడ్డి : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి రాజేశ్ కొత్తరేషన్ కార్డుల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఏళ్లుగా రేషన్‌కార్డులకు ఎదురు చూశామని, ప్రభుత్వం కార్డులు మంజూరు చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌గౌడ్, షేక్ అక్బర్ , రంగరి గారి సంజీవులు, వెంకాగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో కొత్తరేషన్ కార్డుల ధ్రువపత్రాలను ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు బండి ప్రవీణ్ లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు దుంపల బాలరాజు ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, తోట లింగం విలేజ్ కాంగ్రెస్ నాయకులు బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామంలో నిర్మిస్తున్నటువంటి ఇందిరమ్మ ఇళ్లను మండల కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నూతన రేషన్ కార్డుల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.మండల అధ్యక్షుడు సుతారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూమాగౌడ్, మల్లుగారి మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్ వివిధ గ్రామాల అధ్యక్షులు నరసింహారెడ్డి, పరశురాములు, నాగరాజు గౌడ్,రాకేష్ రెడ్డి, పుట్ట మల్లేష్, నారాయణ రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

68 మంది బాల కార్మికుల గుర్తింపు

- ముగిసిన ఆపరేషన్ ముస్కాన్–11
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి 31వ తేదీ వరకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–11లో 68 మంది బాల కార్మికులను గుర్తించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, చైల్డ్ లైన్ 1098 ల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇందుకోసం డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలకార్మికులు, వీధి బాలల, తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, రక్షణ కల్పించడం చర్యలు చేపట్టామన్నారు. మొత్తం 68 మంది పిల్లలను రక్షించామన్నారు. అందులో 9 మంది బాలికలు, 59 మంది బాలురు ఉన్నట్లు వెల్లడించారు. వారిలో ఐదుగురు వీధి బాలల, 30 మంది బాల కార్మికులు, 33 మంది బడి బయట పిల్లలు ఉన్నట్లు తెలిపారు. బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పిల్లల భవిష్యత్తు, విద్య ప్రాముఖ్యతపై కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం పిల్లలందరినీ అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేర్పించామన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పిల్లల హక్కులను కాపాడడం, వారి భవిష్యత్తును మెరుగుపరచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తుండగా ఘటన

మాచారెడ్డి: గుర్తు తెలియని వాహనం ఢీ కొని రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి పాల్వంచ మర్రి వద్ద చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచకు చెందిన కుర్మ లచ్చయ్య(40)ద్విచక్ర వాహనంపై ఎలుపుగొండ శివారులో పొలానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో లచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ బాలుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన



మృతి చెందిన బాలుడి వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

బాన్సువాడ: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందగా, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి కుటుంబీకులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా.. బిచ్కుంద మండలం శాంతాపూర్ గ్రామానికి చెందిన భాను ప్రసాద్(16) మంగళవారం రాత్రి జ్వరం రావడంతో అతడిని కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో సిబ్బంది పట్టించుకోలేదని ఉదయం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో బాలుడిని వెంటనే తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. దీంతో బాలుడి మృతదేహాన్ని బాన్సువాడలోని ఆస్పత్రి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. పోలీసులు చొరవ చేసుకుని కుటుంబీకులకు నచ్చ జెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



పోలీసులతో వాగ్వాదం పెట్టుకుంటున్న కుటుంబీకులు